

పెండింగ్ బిల్లులు ఇచ్చేదెప్పుడు?

- ఏడాదికాలంగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టర్లు
- 'బల్దియా' పనులు చేసేందుకు నిరాసక్తత
- టెండర్ల బహిష్కరణకు నిర్ణయం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 3: బల్దియా అభివృద్ధి పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు ఉత్సాహంగా పోటీపడి పగిడీలు పంచుకొని టెండర్లలో పనులు దక్కించుకోవడం ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. నగరపాలక సంస్థ సాధారణ నిధుల టెండర్లలో పనులు దక్కించుకొని నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసినా బిల్లులు రావడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు బల్దియా పనులు అంటే ఆసక్తి చూపించడం లేదు. వినాయకచవితి, బతుకమ్మ, దసరా పండుగ వచ్చిందంటే చాలు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు తలనొప్పి మొదలవుతోంది. పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేస్తామని కాంట్రాక్టర్లు అంటున్నారు. పండుగకు ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, వెంటనే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించాలంటూ పాలకవర్గం, ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా మారింది.

నిలిచిన నిధులు

గతంలో నగరపాలక సంస్థలో సాధారణ నిధులు లేక పోయినా పండుగ, పబ్బాలకు సంబంధించిన పనులకు కొంత ఆలస్యంగానైనా బిల్లులు వస్తాయిలే అనుకుని పెద్ద కాంట్రాక్టర్లు పనులను చేసేవారు. ప్రస్తుతం నగరపాలక సంస్థకు ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. దీంతో జనరల్ ఫండ్ ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయ నిర్వహణ ఖర్చులకే సరిపోతోంది. గతంలో జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జనరల్ ఫండ్‌కు సంబంధించిన పనులు చేసిన కాంట్రాక్టర్లపై ఆర్థిక భారం పడుతోంది. ఇకపై నగరపాలక సంస్థ జనరల్ ఫండ్‌తో పిలిచే టెండర్లను బహిష్కరించాలని, పనులు చేయవద్దని కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నారు.

గత నెలల్లో వినాయక చవితి సందర్భంగా నగరంలోని రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చటం, ప్యాచ్ వర్క్‌లు చేయడం కోసం 60 లక్షలతో నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు పాల్గొనలేదు. దీంతో టెండర్ల గడువును రెండు రోజులపాటు పొడిగించిన ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లను పిలుచుకొని పెండింగ్ బిల్లులు మొత్తం ఇచ్చేందుకు నిధులు లేవని, ఒక్కో కాంట్రాక్టర్‌కు లక్షా 50వేల చొప్పున పార్ట్ పేమెంట్ చేస్తామని చెప్పారు. వినాయక చవితి పండుగ సమీపిస్తున్నందున టెండర్లలో పాల్గొని పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు అప్పగించడంతో వారు పనులు పూర్తి చేశారు. వారికి ఇచ్చిన మాట ప్రకారంగా 78 మంది కాంట్రాక్టర్లకు లక్షా 50 వేలు ఇవ్వకుండా 60,000 చొప్పును కొందరికే ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు బతుకమ్మ, దసరా పండుగ పనులను చేయవద్దంటూ నిర్ణయించుకున్నారు.

దసరా, బతుకమ్మ ఏర్పాట్లకు టెండర్లు

బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్ల కోసం రోడ్లపై గుంతలు పూడ్చడం, ప్యాచ్ వర్క్‌లు చేయడం కోసం48 లక్షలు, కోటి 10 లక్షలతో లైటింగ్ ఏర్పాట్ల టెండర్లను నగరపాలక సంస్థ నిర్వహించింది. సివిల్ వర్క్ పనులకు రెండో తేదీ గడువు విధించగా కాంట్రాక్టర్లు ఎవరు కూడా షెడ్యూళ్లను దాఖలు చేయలేదు. లైటింగ్ పనుల టెండర్లకు ఈనెల 5వ తేదీ గడువు విధించగా వాటిని బహిష్కరించాలని ఆలోచిస్తున్నారు. పండుగలు సమీపిస్తున్నా ఇప్పటికీ టెండర్లను ఖరారు చేయలేదు. అసలు పండుగ ఏర్పాట్లు పూర్తవుతాయో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే జనరల్ ఫండ్‌లో నిధులు తక్కువగా ఉన్నాయని, ముందుకుగా జీతభత్యాలు చెల్లిస్తామని, ఆ తర్వాత వచ్చే నిధులను చెల్లిస్తామని, పనులు చేయాలంటూ నయానో..భయానో ఒప్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులు తంటాలు పడుతున్నారు. బల్దియా ఖజానాలో డబ్బులు లేక పోవడమే ఈ సమస్యలన్నింటికి ప్రధాన కారణమని తెలుస్తున్నప్పటికీ పండుగ ఏర్పాట్లు ఆగే పరిస్థితి లేనందున అధికారులు సతమతమవుతున్నారు. కాంట్రాక్టర్లు మాత్రం తమకు ఇప్పటికే పనులు చేసిన వాటికి సంబంధించిన బిల్లులు దాదాపు 40 కోట్లు రావలసి ఉందని, ఇంకా రికార్డు చేయని పనులకు సంబంధించిన బిల్లులు మరో 10 కోట్లు ఉంటాయని, 50 కోట్ల పెండింగ్ బకాయిలు ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తున్నారు.

బిల్లులు నిలిపివేశారు...

దుగ్గు మహేందర్ రాకేశ్, మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్

పండుగలకు ముందు పాత బిల్లులు చెల్లించే వారు. ఇప్పడు డబ్బులు లేవని బిల్లులు ఇవ్వడం లేదు. వినాయక చవితి ముందు చెప్పినట్లుగా ఒక్కొక్కరికి లక్షా 50 వేలు ఇవ్వలేదు. మరోవైపు బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్ల పనులకు సంబంధించి అంచనా రేట్లను తగ్గించారు. బిల్లులు ఇవ్వరు. అంచనాలు తగ్గిస్తే, మళ్లీ బిల్లులు ఎప్పుడిస్తారో తెలియదు. అప్పులు చేసి పనులు పూర్తిచేసే బదులు ఊర్కోవడమే మేలు. ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు ఇవ్వకుండా, రేట్లు తగ్గించి మాకు ఏమాత్రం సహకరించడం లేదు. ఈ నేపథ్యంలో బిల్లులు ఇచ్చే వరకు పనులు చేయవద్దని నిర్ణయించుకున్నాం. పెండింగ్ బిల్లులు ఇస్తేనే కొత్త పనులు చేస్తాం.



దుర్గాదేవీ.. నమోస్తుతే

కొలువు తీరిన దుర్గామాత మూర్తులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 3: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు కూడళ్లలో, ఆలయాల్లో నెలకొల్పిన మంటపాలకు భక్తులు వివిధ వాహనాల్లో అమ్మవారి మూర్తులను తరలించారు. మండపాలను విద్యుత్ దీపాలతో, పూలతో ముస్తాబు చేసి రోజుకో అలంకారంతోపాటు అర్చనలు, అభిషేకాలకు, ప్రత్యేక పూజలకు, కార్యక్రమాలకు రూపకల్పన చేసుకున్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో అమ్మ వారి ప్రతిష్టాపన, బాలా త్రిపుర సుందరి దేవి పూజలు నిర్వహించారు. శైలపుత్రి అలంకారం, చతుష్షష్టి ఉప చారాలు చేశారు. ఆలయ నిర్వాహకుడు, ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులు హాజరై పూజలు జరిపారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన భక్తులు, భవానీ దీక్షాపరులతో ఆలయం పోటెత్తింది. మహిళల పూజలు, అర్చనలతో ఆలయంలో సందడి నెలకొంది. సాయంత్రం అమ్మ వారికి ఫలరస పంచామృత, పుష్పాభిషేకం నిర్వహించారు. బొమ్మకల్ రోడ్ యజ్ఞ వరాహస్వామిక్షేత్రంలో వసుధాలక్ష్మీ, వర దుర్గా సమేత వాగ్వాదిని మహాసరస్వతి ఆలయంలో అంకురార్పణ, నవకలశ స్నపనము, సాయంత్రం పారాయణాలు, రాత్రి సారస్వత కల్పోక్త ప్రకారం చతుష్షష్టి పూజలు చేశారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో అమ్మ వారికి బాలా త్రిపుర సుందరి అలంకరణ చేశారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయం, వావిలాలపల్లి హనుమత్ సహిత కనకదుర్గ ఆలయంలో పూజలు జరిగాయి. రామేశ్వరాలయంలో పర్వత వర్ధినీ మాతకు విశేషాలంకారం చేశారు. బొమ్మకల్ రోడ్ అంబా భవానీ ఆలయం, టవర్‌సర్కిల్, ప్రకాశం గంజ్, రాంనగర్, మంకమ్మతోట, గాంధీరోడ్, శ్రీపురం కాలనీతో పాటు పలు ఆలయాల్లో, కూడళ్లలో నెలకొల్పిన దుర్గామాత మండపాల వద్ద ప్రతిష్ఠాపనా పూజలు జరిగాయి.



మహాశక్తి ఆలయంలో పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

సన్నవరి ధాన్యానికి

క్వింటాల్‌కు రూ. 500 బోనస్

- కొనుగోలు కేంద్రాలకు సీరియల్ నంబర్ కేటాయించాలి
- దసరాలోగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కరీంనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సన్న వరి ధాన్యం సేకరణలో క్వింటాల్‌కు అదనంగా 500 రూపాయలు బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఖరీఫ్ 2024-25 ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన, నియామక ఉత్తర్వుల జారీ తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో పటిష్ట కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఏడువేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సీజన్ నుంచి సన్నరకం వరి ధాన్యం, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కొనుగోలు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ప్యాడీ క్లీనింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. టోకెన్ పద్ధతి పాటించాలని, కొనుగోలు కేంద్రాలకు సీరియల్ నంబర్లు కేటాయించా లని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన ఏర్పాట్లు చేయాలన్నారు. కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

పక్క రాష్ట్రం నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడ అమ్మే అవకాశం ఉన్నందున పోలీసు అధికారులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్సీ-24 ద్వారా ఎంపికైన 11,062 మంది అభ్యర్థులకు ఈనెల 9న సాయంత్రం 4 గంటలకు నియామక పత్రాలను అందజేస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసేందుకు కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఈ పోటీలను ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి ఓ ప్రకనటలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు రన్స్, త్రోస్, జంప్స్ అంశాలలో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 7,8 తేదీల్లో హన్మకొండలో నిర్వహించనున్నరాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేస్తావనిఇ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటోతో ఉదయం 8 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

కులవృత్తుల వారికి

సాంకేతిక శిక్షణ ఇస్తాం

- చేప పిల్లల ఉత్పత్తిలో కరీంనగర్ కీలకం.. ● మంత్రి పొన్నం ప్రభాకర్



ఎల్ఎండీలో చేప పిల్లలను వదులుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, ఫిషరీస్ స్టేట్ చైర్మన్ సాయికుమార్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 3: కులవృత్తులవారికి సాంకేతిక శిక్షణ ఇచ్చి, ఉపాధికల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అధ్యక్షతన లోయర్ మానేరు డ్యాంలో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీలో కొంత జాప్యం జరిగినా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కొద్ది సంవత్సరాలుగా చేప పిల్లలు పంపిణీ చేసిన వారికి బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీనిపై పరస్పర ఫిర్యాదులు, విచారణ జరుగుతుండడంతో జాప్యం జరిగిందన్నారు. పాత బకాయిలు న్యాయబద్ధంగా రావాల్సినవి ఇప్పించడం, ప్రస్తుతం సరఫరా చేసిన వారికి బిల్లులు త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి చెప్పడంతోనే ఈ రోజు చేప పిల్లలు పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి పట్టుదల, కృషితోనే రాష్ట్రంలో కరీంనగర్‌తోనే చేప పిల్లల విడుదల కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మానేరు డ్యాంలో 60 లక్షల చేప పిల్లలు పెంపకానికి సామర్థ్యం ఉందని, 40 లక్షల చేప పిల్లలు వేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉత్తర తెలంగాణలోనే చేప పిల్లల ఉత్పత్తి కరీంనగర్ కీలకంగా మారిందన్నారు.

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల వల్లనే చేప పిల్లల పంపిణీ సాధ్యమైందన్నారు. మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక అలా మాట్లాడుతూ రాష్ట్రంలో 29 వేల చెరువులకు 85 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ చేపపిల్లల సరఫరాకు సంబంధించిన పాతబకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, చాడగొండ బుచ్చిరెడ్డి, నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, పురమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

● ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

కరీంనగర్ రూరల్: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ మండలం తాహెర్ కొండాపూర్‌లో డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టులో భాగంగా నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తాహెర్ కొండాపూర్ గ్రామంలో పలు నివాసాలకు వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు, హెల్త్ కార్డు, పింఛన్, ప్రభుత్వ పథకాలన్నింటికి డిజిటల్ కార్డులే ప్రామాణికం కానున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, చాలా మంది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్డులో కుటుంబ పెద్దగా మహిళనే ఉంటుందన్నారు.

రుణమాఫీపై అపోహలు వద్దు...

రుణమాఫీపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. అర్హత ఉండి ఎక్కడైన రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, కాంరెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.



తాహెర్ కొండాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

9న కరీంనగర్‌కు సీఎం కప్ టార్చ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: స్పోర్ట్స్ అథార్టీ ఆఫ్ తెలంగాణ (సాట్స్) ఆధ్వర్యంలో నిర్వహించే చీఫ్ మినిస్టర్స్ కప్-2024కు సంబంధించిన టార్చ్ ఈ నెల 9న కరీంనగర్‌కు రానున్నది. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఈ టార్చ్‌ను ప్రారంభించగా పలు జిల్లాల మీదుగా టార్చ్ రిలే కొనసాగి ఈనెల 9న కరీంనగర్‌కు చేరుకోనున్నది. ఈ సందర్భంగా అల్గునూర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తారు. ర్యాలీ బాధ్యతలను యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్‌కు అప్పగించారు.

587 మంది డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 3: డీఎస్సీ-24లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన 1:3 అభ్యర్థుల్లో 587 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. మిగిలిన అభ్యర్థులు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా కేంద్రంలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

పారిశుధ్య పనులను మెరుగుపరచాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 3: నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి శానిటేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం నగరంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్సు, బయోమెట్రిక్ హాజరు అంశాలపై శానిటేషన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేలా చూడాలని సూచించారు. ప్రతి రోజు ఉదయమే కార్మికులు సహా ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు వీధుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించాలని ఆదేశించారు. కార్మికుల బయోమెట్రిక్ హాజరు శాతాన్ని క్రమం తప్పకుండా తీసుకోవా లని, ప్రతి రోజు హాజరు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి ఆ సమస్యను ముందుగా పరిష్కరించాలన్నారు. వంద శాతం ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, వేరు చేసిన చెత్తను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణ యజమాని విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, దుకాణాలకు వెళ్లి వంద శాతం ఫీజులు వసూలు చేసి బల్దియా ఆదాయాన్ని పెంచాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సువార్త, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గట్టు శ్రీనివాస్, వెంకన్న, శ్రీధర్, నరోత్తంరెడ్డి, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. గురువారం సెమీ ఫైనల్‌లో నిజామాబాద్‌తో తలపడిన ఉమ్మడి జిల్లా జట్టు విశేష ప్రతిభ చాటి ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 పరుగులకు ఆల్ అవుట్ అయింది. కరీంనగర్ జట్టు నుంచి విగ్నేష్ 59 పరుగులు, ఈ తక్షిల్ 38 పరుగులు చేయగా విగ్నేష్ మూడు వికెట్లు, అన్వేష్, అశిష్‌రెడ్డి, రుత్విక్ చెరి రెండు వికెట్లు తీశారని జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు పి మనోహర్‌రావు తెలిపారు. జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎస్ మురళీధర్‌రావు, సంఘం సభ్యులు అజిత్‌కుమార్, విద్యాసాగర్ రావు, శ్రవణ్‌కుమార్ అభినందించారు.



పట్టణ పురవీధుల్లో హంస వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు



శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

రాజన్న క్షేత్రంలో
దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఆలయాన్ని తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతామూర్తులతో పాటుగా రాజరాజేశ్వరీ అమ్మవారికి లలితా సహస్రనామ సహిత చతుషష్టి పూజలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట సూపరింటెండెంట్ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

● హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం అమ్మవారిని పెద్దసేవపై హంసవాహనంలో నిలిపి పట్టణ వీధులగుండా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని తరించారు. అమ్మవారి ఊరేగింపునకు ముందు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొని పెద్ద సేవలో పాల్గొన్నారు. రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సాంప్రదాయ దుస్తులను అందజేశారు.

ధర్మపురి, కొండగట్టులో..

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీనృసింహస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు భరత్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్ వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కలశ స్థాపనలు, విశ్వక్సేన పూజలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయంలో ఉదయం వేద బ్రాహ్మణులు, రుత్వికులచే మహా సంకల్పం, పృథ్వీ, కలశ, గణపతి పూజ, మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మ వారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం లక్ష్మీ నృసింహ స్వామి వారలను అశ్వ వాహనంపై పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో, తిమ్మాపూర్ సీతా రామచంద్రస్వామి ఆలయంలో, ఒజ్జలవారి వీధిలో, నేరెళ్లలో నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి క్షేత్రంలో శైలపుత్రి రూపంలో అమ్మవారు



కొండగట్టులో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండగట్టులో మళ్లీ తలానీలాల టెండర్లు

- ● 17న నిర్వహణకు ఏర్పాట్లు
- ● తక్కువ వేలం రావడమే కారణం

మల్యాల, అక్టోబరు 3: కొండగట్టు ఆంజనేయ స్వామి పరిధిలో తలానీలాలు పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు నిర్వహించనున్నారు. నాలుగోసారి సోమవారం నిర్వహించిన వేలం ప్రక్రియ దాదాపు ఖరారు అయ్యే క్రమంలో తక్కువ వేలం వచ్చిందని అధికారులు మరో సారి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో పలుమార్లు ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెట్‌లో ధరలు లేవనే సాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్‌దారులు సోమవారం నిర్వహించిన వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎన్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.76కోట్లు హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించగా తక్కువ వేలం వచ్చిందని, రెండేళ్ల క్రితం రూ.3.64 కోట్లు పలికిన టెండర్ ప్రస్తుతం రెండు కోట్లు దాటకపోవడంతో మరో సారి నిర్వహించాలని కమిషనర్ ఆదేశించడంతో సోమవారం నాటి టెండర్‌ను రద్దు చేశారు. తలనీలాల టెండర్ పెరగకుండా తక్కువ ధరలు పలుకడానికి ఒక్క ప్రాంతం నుంచి టెండర్‌దారులు వస్తుండడమే కారణమని తెలుస్తుండడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 17న టెండర్లు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో గతంలో పోగు చేసిన తలనీలాలకు సైతం టెండర్ 17న నిర్వహించనున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

గణేశ్‌నగర్, అక్టోబరు 3: రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు శాత వాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మేనేజ్‌మేంట్ అసోసియేషన్(సుప్మా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్య దర్శి శ్రీపాద నరేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాలేదన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కూడా ఉన్నత విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఫీజు బకాయిల గురించి ఎన్నిసార్లు మంత్రులు, అధికార్ల చుట్టూ తిరిగినా ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దసరాలోపు ఫీజు బకాయిలు చెల్లించాలని కోరారు. బకాయిలపై ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తెరవకూడదని నిర్ణయించామని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గురువారం 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,525 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 3: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 82క్వింటాళ్ల విడి పత్తి, 34మంది రైతులు 58క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

క్రైం కార్నర్

మృతదేహం కోసం గాలింపు
- సొంత బావే హంతకుడు?

కథలాపూర్, అక్టోబరు 3: మండలంలోని చింతకుంటకు చెందిన నేతుల మల్లేశ్ అదృశ్యమైన ఘటనలో మిస్టరీ వీడినట్లు తెలిసింది. సొంత బావే మరి కొందరితో కలిసి హతమార్చినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. మల్లేశ్‌ను చంపిన అనంతరం వరదకాలువలో మృతదేహాన్ని పడేసిన నేపథ్యంలో గురువారం ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో జాలర్లతో అన్వేషణ కొనసాగించారు. దుంపెట శివారు నుంచి తక్కళ్లపల్లి, దమ్మన్నపేట మీదుగా రాంపూర్ పంపు హౌజ్ దాకా జాలర్లతో వెతికినా ఫలితం లేకుండా పోయింది. వరద కాలువ పక్కన ఉన్న చెట్లకు ఎక్కడైనా తగిలి మృతదేహం నిలిచిపోయి ఉంటుందనే అనుమానంతో వెతికారు. మంగళవారం అర్ధరాత్రి మల్లేశ్‌తో కలిసి తన బావ మరి కొందరు మద్యం తాగగా అక్కడే మాటా మాటా పెరిగి ఇద్దరి మధ్య తోపులాట జరిగినట్టు తెలిసింది. అదే క్రమంలో పక్కనే ఉన్న వరద కాలువలో పడేసినట్టు మృతుడి బావ అంగీకరించాడని తెలుస్తోంది. మృతదేహం కోసం పోలీసులు వరద కాలువ ప్రవాహాన్ని తగ్గించి గాలింపు చేపట్టారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో ఈనెల 1న నన్నపునేని విద్యాసాగర్‌ను చంపిన తమ్ముడు నన్నపునేని విక్రమ్‌రాజ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకర్ల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు విద్యాసాగర్, తమ్ముడు విక్రమ్‌రాజుకు కొన్ని రోజులుగా భూవివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భే తగాదాలను మనసులో పెట్టుకొని ఎలాగైనా విద్యాసాగర్‌ను అంతమొందించాలని విక్రమ్‌రాజు పథకం రూపొందించాడు. ఈక్రమంలో ఈనెల 1న తన ఇంటి సమీపంలో పాత పగలు మనసులో పెట్టుకొని వాగ్వివాదానికి దిగాడు. మాటామాటా పెరిగి విద్యాసాగర్ తలపై తమ్ముడు విక్రమ్‌రాజు రోకలిబండతో బలంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై సధాకర్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టగా అంతర్గాం శివారులో నిందితుడు విక్రమ్‌రాజును మధ్యాహ్నాం సమయంలో పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డిని, ఎస్సై సధాకర్‌ను, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

ఆలయంలో చోరీ
- వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో గల రాజరాజేశ్వర దేవాలయంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని కిలో వెండి నాగభరణం, అరతులం వెండి, అరతులం బంగారు చైన్ ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 3: గంభీరావుపేట మండలం బరిగెల గూడెం కాలనీకి చెందిన శనిగరపు జీవన్ (31) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపాన గల వ్యవసాయ బీడు భూమిలో చెటుకు ఉరి వేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జీవన్ గత కొంత కాలంగా షుగర్ వ్యాధిలో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. తరుచూ వ్యాధి తీవ్రతపై బాధపడుతూ జీవన్ ఇంట్లో చెప్పుకునేవాడు. వ్యాధి ప్రబావాన్ని తట్టుకోలేక నిత్యం మనస్తాపం చెందేవాడు. గురువారం ఉదయం టీ తాగి వస్తానని చెప్పి జీవన్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, గ్రామ సమీపాన ఉన్న ఓ బీడు భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవన్ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, అక్టోబరు 3: గోదావరిఖని గంగానగర్ గోదావరి వంతెన వద్ద గురువారం రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గోదావరిఖని నుండి ఆటోలో మంచిర్యాల వైపునకు బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు జరిపారు. ఆటోలో ఉన్న 8.5క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనపర్చుకుని ఆటోలను సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న తూర్పాటి ప్రకాష్, చింతల చిన్నలను అదుపులోకి తీసుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



అవినాష్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3: రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొమ్మకంటి అవినాష్(28) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బొమ్మకంటి రమ్య- రవీందర్ దంపతుల చిన్న కొడుకు అవినాష్ కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తుండేవాడు. రెండు రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అక్కడి చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించి ఎల్లారెడ్డిపేటలోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులుగా చికిత్స పొందుతున్న అవినాష్ పరిస్థితి విషమించి గురు వారం చనిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వ హించారు. యువకుడు ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికంగా చర్చించుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్ పరామర్శించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ముత్తారం అక్టోబరు 3: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు వాగు వద్ద గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకు వచ్చింది. గ్రామపంచాయతీ సెక్రెటరీ ఇచ్చిన సమాచాం మేరకు ఎస్సై గోపతి నరేష్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరీక్షించారు. వృద్ధురాలి వయసు 50 నుంచి 65 సంవత్సరాల ఉంటుందని, పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండి ఒంటిపై ఎర్ర చీర, ఎర్ర జాకెట్టు ధరించి ఉందని, మృతదేహం గుర్తు పట్టలేకుండా ఉందన్నారు. పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు

- రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టివేత
- 40క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీ, అక్టోబరు 3: 'దర్జాగా రేషన్ బియ్యం దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై పౌర సరఫరాలశాఖ స్పందించింది. గురువారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు గోదావరిఖనిలో దాడులు నిర్వహించారు. గోదావరిఖనిలో రేషన్ బియ్యం దందా చేస్తున్న కింగ్‌పిన్‌పై ఫోకస్ పెట్టారు. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో బృందం నిఘా పెట్టింది. గురువారం సాయంత్రం గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లి రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల గోడౌన్‌ల నుంచి బియ్యం తరలిస్తుండగా వ్యాన్(టీఎస్22టీఏ1039)ను పట్టుకున్నారు. అందులో 84బస్తాల్లో ఉన్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ రామగుండం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్‌లో బియ్యం తరలిస్తున్న పాశం విక్రమ్‌పై కేసు నమోదు చేశారు.

● కాగా గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు జరుగుతున్నాయనే సమాచారంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని రేషన్‌షాపులు మూసివేశారు. రేషన్ షాపుల్లో నుంచి నేరుగా అక్రమ రవాణాదారులకు బియ్య రవాణా జరుగుతుందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ నిఘా పెట్టింది.

నలుగురు దొంగల అరెస్టు

- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, అక్టోబరు 3: కూలీ పనులు చేస్తూ వచ్చే సంపాదన సరిపోవడం లేదని భావించిన కొందరు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయడమే వృత్తిగా ఎంచుకున్నారని, ఇందులో నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. దొంగలందరూ మంచిర్యాల జిల్లాకు చెందినవారని, కొన్ని సంవత్సరాల నుంచి వీరు ఆస్తి సంబంధిత నేరాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాత్రివేళలో తాళం వేసి ఉన్న ఇళ్లను, షాపులను ఎంచుకుని వాటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనాలు చేస్తున్నారని, వీరిలో గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని, కొందరు జైలుకు కూడా వెళ్లివచ్చారన్నారు. ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. అరెస్టయిన వారిలో మంచిర్యాల జిల్లా మందమర్రికి యాపల్‌కు చెందిన పిట్టల సురేందర్, మందమర్రి విద్యానగర్‌కు చెందిన సిలివేరు శంకరయ్య, బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన గోషిక కార్తీక్, మందమర్రి చెల్లాపూర్‌కు చెందిన పసుపులేటి శ్రీనివాస్‌లు ఉన్నారు. వీరి ముఠాలోని గుర్రాల చిన్న భూమయ్య, రాము అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. గతనెల 23 అర్ధరాత్రి ప్రాంతంలో సుల్తానాబాద్‌లోని కరీంనగర్ రోడ్డులోగల శాస్త్రినగర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ఈ దొంగలు కిటికీ రాడ్స్‌ను కట్ చేసి లోపలికి వెళ్లి 300కిలోల కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు గాయం నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తాము దర్యాప్తు చేయగా ఈ దొంగలు పట్టుబడ్డారని చెప్పారు. గురువారం ఉదయం ఇదివరకు దొంగతనం చేసి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో మళ్లీ దొంగతనానికి రాగా పోలీసులు వారిని పట్టుకుని విచారించగా దొంగలు అందరూ పట్టుబడ్డారని తెలిపారు. అయితే చోరీ చేసిన కాపర్ వైర్‌ను కొంత అమ్మి డబ్బులు పంచుకున్నారని, మిగతా కొంత వైర్ వీరి వద్ద ఉంచుకున్నారని, దొంగలు హైదరాబాద్‌లో విక్రయించిన రాము అనే వ్యక్తి వద్ద కూడా రాగి వైర్ రికవరీ చేశామన్నారు. ఈ దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులతో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో రాజన్న జోన్-3 (కరీంనగర్, మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి) స్థాయిలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి గురువారం వివిధ విభాగాల్లో కమిషనరేట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ ఎంపిక కోసం కమీషనరేట్‌లు, జిల్లాలవారీగా ఈ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో ముఖ్యంగా ఫోరెన్సిక్ సైన్స్, క్రైం ఇన్వెస్టిగేషన్, చట్టాలు, మెడికో లీగల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్, క్రైం సీన్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, క్రైంసీన్ పరిశీలన, ఆంటీ సాబొటేజ్ చెకింగ్‌లో భాగంగా వాహనాల చెకింగ్, గ్రౌండ్ తనిఖీ, రూమ్ తనిఖీ, యాక్సిస్ కంట్రోల్‌లో నైపుణ్యత, కంప్యూటర్‌పై అవగాహన, డాగ్ స్క్వాడ్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్, నార్కోటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో జోనల్ స్థాయి తర్వాత రాష్ట్ర స్థాయిలో మళ్ళీ పోటీలు నిర్వహించేందుకు ఎంపికలు వుంటాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికయిన వారికి శిక్షణ అనంతరం ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోటీల్లో కమిషనరేట్‌లోని అన్ని విభాగాలు, డివిజన్‌ల నుంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3: వన్యప్రాణులను సంరక్షించాలని అటవీశాఖ రేంజ్ అధికారి ఎండీ షౌకత్‌హుస్సేన్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా గురువారం కరీంనగర్ డీర్‌పార్క్‌లో జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) సీహెచ్ బాలమణి ఆధ్వర్యంలో పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ ప్రకృతికి ఆటంకం కలుగకుండా మనుషులు మెదులుకుని జంతువులను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) టి శేఖర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(ఎఫ్‌బీఓ)లు సుజాత, కె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాములు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 3: తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాములు కోరారు. గురువారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కరీంనగర్, కొత్తపల్లి మండలాల గ్రామ పంచాయతీ కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గ్రామాల వారిగా ఎంపిక చేసిన కార్మికులు నీటి సహాయకులుగా విధులను నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేసే బాధ్యత సహాయకులపై ఉంటుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు బోరువిద్యుత్ మోటార్ల మరమ్మత్తులు, పైపులైన్ లీకేజీ మరమ్మత్తులు తదితర అంశాల్లో కార్మికులకు శిక్షణ, అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం అధికారులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ టి అంజన్ రావు, డీఈ శ్రీనివాస్, ఎఈలు అనూష, వినయ్, ప్రసన్న, ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీనరసింహ శతకం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 3: సాహితీవేత్త, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు రచించిన శ్రీలక్ష్మీనరసింహ శతకం పుస్తకావిష్కరణను సమైక్య సాహితి సహకారంతో శుక్రవారం ఉదయం 11 గంటలకు గంగాధర మండలం కోట్ల నరసింహులపల్లె గ్రామం అన్నపూర్ణ సేవాసదన్‌లో నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి, ఆలయ ట్రస్టు కార్యదర్శి కల్వకోట కీర్తి కుమార్, సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, మరో అతిథిగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ హాజరౌతారని పేర్కొన్నారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి


చికిత్స పొందుతున్న అక్షర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 3: జమ్మికుంట మండలం కోరపల్లిలో గురువారం చిన్నారి (3)పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రా మానికి చెందిన మద్దర్ల అక్షర ఇంటి ముందు ఆడుకుంటోంది. అక్కడే ఉన్న ఓ పిచ్చి కుక్క అక్షరపై ఒక్కసారిగా దాడి చేసి గాయపరి చింది. చిన్నారి పెదవి తెగి వేలాడడంతో పాటు తలకు గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తం కారి పోతుండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతో చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. మండలంలోని కోరపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పిచ్చికుక్కల దాడులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోరపల్లిలో రెండు రోజుల వ్యవధిలో ఐదు గురిపై దాడి చేశాయి. స్వరూప, వెంకటస్వామితో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో రమ అనే మహిళపై పిచ్చికుక్క దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు పిచ్చి కుక్కను వెంబడించి హత మార్చారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పిచ్చి కుక్కలను నియంత్రిస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

మహిళలకు వైద్య పరీక్షలు

శంకరపట్నం, అక్టోబరు 3: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య మహిళా క్యాంపు నిర్వహించి పరీక్షలు చేశారు. మండల వైద్యాధి కారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అంబాలాపూర్ గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైనట్లు చెప్పారు. డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన ఇంటి చుట్టూ 50 మీటర్ల దూరంలో ఉన్న ఇళ్లలో వైద్య సిబ్బంది పైరిత్రం స్ప్రే చేశారు. డ్రై డే నిర్వహించారు. డెంగ్యూ సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు సన, శ్రావణి, శ్వేత, మనోచిత్ర, సబ్ యూనిట్ ఆఫీసర్ మల్లయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సరోజినీదేవి, హెల్త్ అసిస్టెంట్ సరోత్తంరెడ్డి, మలేరియా సిబ్బంది, గ్రామపంచాయతీ సెక్రటరీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న వాగేశ్వరి కళాశాల వలంటీర్లు

తిమ్మాపూర్, అక్టోబరు3: వాగేశ్వరి విద్యా సంస్థల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్చతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పరిసరాల పరిశుభ్రత, పాటించాలని, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంచకూడదని అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు కళాశాల జనరల్ సెక్రటరీ గండ్రా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ఎండీ ఎస్సై వివేక్ హాజరై అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రేఖాఠాకూర్, అధ్యాపకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు బతుకమ్మ సంబరాలు



సైదాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, కరీంనగర్‌లో వేడుకల్లో జిల్లా జడ్జి

సైదాపూర్, అక్టోబరు3: సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి హనుమాన్ ఆలయం వద్ద, సైదాపూర్ బతుకమ్మ బండవద్ద బతుకమ్మ వేడుకలలో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల గురువారం పాల్గొని బతుకమ్మ ఆడారు. అనంతరం దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సైదాపూర్‌కు వచ్చిన మంజులకు మహిళలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, కాంగ్రెస్ నాయకుడు విద్యాసాగర్ రెడ్డి, సీసీ రాజేశ్వరి, సీఏలు, మహిళలు పాల్గొన్నారు.

● సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

● **కరీంనగర్ కల్చరల్:** నగరంలోని అంబేద్కర్ రోడ్ మెయిన్ క్యాంపస్, తుక్కారావు క్యాంపస్‌లో గల ట్రినిటి జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంతరెడ్డి విద్యార్థులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

● **కరీంనగర్ లీగల్:** కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా జడ్జి ప్రతిమ, మహిళా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

● **భగత్‌నగర్:** పూలను దేవతలుగా పూజించే పండుగ బతుకమ్మ అని అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి పట్టణంలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి దుర్గామాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్కపూవులతో బతుకమ్మలు అలంకరించి, గౌరమ్మలను తయారు చేసి భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పాటలతో పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● నగరంలోని ఎస్ఆర్ఎం ఎంబిఏ, ఎంసీఏ కళాశాలలో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి పాటలు, నృత్యాలతో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎం తిరుపతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 3: పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ కోరారు. గురువారం ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీనకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్రెటరీగార్డ్స్, ప్లంబర్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారందరికి గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆరోపించారు. జీతాలు రాక ఇంటి కిరాయి కట్టలేక, నిత్యవసర వస్తువులు కొనలేక కార్మికులు కుటుంబాలను పోషించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇక తెలంగాణలోనే పెద్ద పండగ అయిన బతుకమ్మ, దసరా పండగలకు కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పండగలను దృష్టిలో ఉంచుకొని కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, కార్యదర్శి టి కళావతి తదితరులు పాల్గొన్నారు.

గుంటక నరసయ్య పంతులు జయంతి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 3: నగరంలోని పద్మశాలి హాస్టల్‌లో గురువారం జిల్లా పద్మశాలి వెల్ఫేర్ ట్రస్టు, శరత్ సాహితీకళా స్రవంతి ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, గాంధేయవాది, చేనేతోద్యమ పితామహుడు గుంటక నరసయ్య పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. పద్మశాలి వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు స్వర్గం మల్లేశం మాట్లాడుతూ హాస్టల్‌లో పంతులు విగ్రహం పెట్టడానికి కృషి చేస్తామన్నారు. విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరినరసయ్య పంతులపై రాసిన గుంటక నరసయ్య పంతులు జీవితం-ఆదర్శం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూర్ల వేంకటేశ్వర్లు, డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య, పచ్చునూరి నరసయ్య, జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షుడు మెతుకు సత్యం, మాజీ మండల అధ్యక్షుడు వాసాల రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర కీలకం

కరీంనగర్ లీగల్, అక్టోబరు 3: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని డాక్టర్ బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బిఎన్ రావు అన్నారు. గురువారం జిల్లా కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు మేధావులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావల్సిన అవసరముందని అన్నారు. త్వరలో జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీచేస్తున్నానని, ఓటు వేసి గెలిపించాలని బీఎన్‌రావు న్యాయవాదులను కోరారు.

'మంత్రి కొండా సురేఖకు క్షమాపణ చెప్పాలి'



తెలంగాణ చౌక్‌లో నిరస తెలుపుతున్న మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు

గణేశ్‌నగర్, అక్టోబరు3: సోషల్ మీడియాలో మంత్రి కొండా సురేఖపై అసభ్యకరంగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరాచౌక్‌లో కర్ర సత్య ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలనే కనీస జ్ఞానం కూడా బీఆర్ఎస్ పార్టీ వారికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న హయాంలో ఒక్క మహిళకు కూడా క్యాబినెట్లో స్థానం కల్పించకపోవడం శోచనీయమన్నారు. కనీసం శిశు సంక్షేమ శాఖకు కూడా ఒక మహిళను నియమించక పోవడం పట్ల మహిళా సమాజం అంటే బీఆర్ఎస్ పార్టీ వారికి ఎంత చిన్నచూపు ఉన్నదో స్పష్టమైందన్నారు. ఇంత జరుగుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గానీ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కానీ స్పందించకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానాన్ని కల్పిస్తూ ఉచిత బస్సు స్కీంను ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుశీల, భారతమ్మ, జిల్లా కార్యవర్గం కవిత, లావణ్య, రజిత రెడ్డి, హసీనా, సత్య అంజలి, స్వప్న, హుజూరాబాద్ టౌన్ అధ్యక్షులు పుష్పలత, మండల అధ్యక్షులు, లత, సుజాత, మంజుల, లావణ్య, స్వప్న, లత, కవిత పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 3: ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయ కుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంటరెడ్డి అన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానంఅమలుచేసే కుట్రసీఎం చేస్తున్నారని ఆరోపించారు. విద్యారంగంపై వెంటనే సమీక్ష నిర్వహించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేనిచో విద్యార్థుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తామని కసిరెడ్డి మణికంటరెడ్డి అన్నారు. ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చట్లా సమ్మయ్య, నగర అధ్యక్షుడు కేశబోయిన రాము, నగర నాయకులు సందీప్‌రెడ్డి, బొల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలు ప్రారంభం

- బ్రాహ్మీ అలంకరణలో అమ్మవారు దర్శనం - ప్రత్యేక పూజలు చేసిన భక్తులు


బ్రాహ్మీ అలంకారంలో అమ్మవారి దర్శనం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 3: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవానీ ఆలయంలో దుర్గా భవానీ నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం దుర్గా భవానీ అమ్మవారు బ్రాహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతలను ప్రతిష్ఠించారు. మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఇల్లందకుంట: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారి విగ్రహా లను ప్రతిష్ఠించి తొలిరోజు పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహిళలు కోలాట నృత్యాలతో మం డపం వద్దకు తీసుకువచ్చారు.

గంగాధర: ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవిని మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు ప్రత్యేక భజనలతో పాటు దాండియా, కోలాటాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వీణవంక: మండలంలో ఏర్పాటు చేసిన మండల పాల్లో దుర్గామాతను ప్రతిష్ఠించారు. నర్సింగాపూర్‌లో దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


హుజూరాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు


ఇల్లందకుంటలో అమ్మవారికి శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

విగ్రహ ప్రతిష్ఠలో అపశ్రుతి

గంగాధర, అక్టోబరు 3: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా దేవి విగ్రహ ప్రతిష్ఠలో గురువారం అపశ్రుతి చోటు చేసుకుంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాతను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించారు. మొదటి రోజు పూజ నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహం స్టేజిపై నుంచి కిందపడింది. అపశ్రుతిగా భావించి వరద కాలువలో నిమజ్జనం చేయడానికి వాహనంలో ఎక్కిస్తుండగా ఓ భక్తుడి కాలుకి గాయాలయ్యాయి. అనంతరం విగ్రహాన్ని వరద కాలువలో నిమజ్జనం చేసి మరో విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంటల నమోదు పరిశీలన

గన్నేరువరం, అక్టోబరు 3: మండలంలోని వివిధ గ్రామాల్లోఏఈవోలు నమోదు చేసిన పంటల వివరాలను ఏడీఏ శ్రీధర్ మండల వ్యవసాయ అధికారి కిరణ్మయితో కలిసి పరిశీ లించారు. రికార్డులలో నమోదు చేసిన వివరాలు క్షేత్రస్థాయిలో వేసిన పంటలను పరిశీలించారు. ఎరువుల దుకాణాల నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. వీరివెంట ఏఈవో ప్రశాంత్, డీలర్ ప్రశాంత్, రైతులు ఉన్నారు.

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

హుజూరాబాద్ లీగల్, అక్టోబరు 3: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న కలీంపై మాదన్నపేట పోలీసుల దాడిని ఖండిస్తూ హుజూరాబాద్ కోర్టు ఎదుట గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సెక్రటరీ తిరుపతి మట్లాడుతూ న్యాయ వ్యవస్థను, న్యాయవాదులను కించపరుస్తూ పోలీసులు మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కలీంపై పరుష పదజాలంతో మాట్లాడి దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగారెడ్డి, భూమి రెడ్డి, అరుణ్‌కుమార్, నర్సింహస్వామి, శ్రీనివాస్, లింగమూర్తి, భానుకిరణ్, రాజేందర్, మురళీ, మౌనిక, సౌమిత్ర, హరిహరన్, కల్యాణ్, కుమార్, ఆస్మిన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది పాత్ర కీలకం

గంగాధర, అక్టోబరు 3: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలో పని చేసే సిబ్బంది పాత్ర కీలకమని ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం మండలంలోని 33 గ్రామాల పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లకు మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆయన మా ట్లాడుతూ గేట్ వాల్వులు సరిచేసుకోవడం, వోహెచ్ఆర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. వర్షాకాలంలో కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు పాటిం చాలని తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ శంకర్, ఏఈ వీరబ్రహ్మం, శిక్షకులు, గ్రామాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచి నీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరం 3,4,5,7 వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు మసియోద్దీన్, బాలరాజు, రోంటాల శ్రీనివాస్, ప్రసాద్, సురేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీంనగర్ క్రైం, అక్టోబరు3: కరీంనగర్ కట్టరాంపూర్ గిద్దెపెరు మాళ్ల ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నామని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 13,250 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

అనుమతిలేని డీజే సౌండ్స్‌పై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3: ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా డీజే సౌండ్స్ వినియోగిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని రూరల్ టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. వావిలాలపల్లిలో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక టాటాఏస్ వాహనానికి డీజే జాకీ, మిక్సర్, సౌండ్‌బాక్స్‌లు బిగించుకుని పెద్దశబ్దం చేస్తూ వెళుతుండగా పట్టుకున్నామని హెడ్‌కానిస్టేబుల్ రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శశికుమార్, గణేష్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 3: నగరంలో విద్యుత్ లైన్ మరమ్మతులో బాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమారులు తెలిపారు. గౌతమినగర్, వినాయక్‌నగర్, కట్టరంపూర్, తిర్మలానగర్, ప్రొఫెసర్ జయశంకర్ కాలనీ, అంబేద్కర్ స్టేడియం నుండి డ్యామ్ రోడ్డు వైపులా ప్రాంతాలు వెంకటేశ్వర కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు, బ్యాంక్ కాలనీ, అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంతం, బ్యాంకు కాలనీ, రెడ్డి ఫంక్షనల్ హాల్ ప్రాంతం సుభాష్‌నగర్ రోడ్డు ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'సమంతపై మంత్రి వ్యాఖ్యలు సరికాదు'

భగత్‌నగర్, అక్టోబరు 3: హీరోయిన్ సమంతపై రాష్ట్ర మంత్రి కొండ సురేఖ అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ అన్నారు. గౌరవప్రదమైన మంత్రి పదవిలో మహిళా మంత్రిగాఉండి వేరే మహిళపై అసభ్యకరమైన వాఖ్యలు చేయటం సరికాదన్నారు. రాష్ట్రంలో విద్యార్థులుఅనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆడపిల్లలపై రోజు అత్యాచారాలు పెరుగుతున్నాయని, వాటి గురించి మాట్లాడకుండా హీరోయిన్ల వ్యక్తిగత అంశాలను తీసుకు వచ్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరికాదన్నారు.

కాంగ్రెస్ పటిష్టానికి కృషి చేయాలి

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 3: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులంతా కలిసికట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదానర్సన్న ఆహ్వానం మేరకు ఆయన ఇంటిలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం వెలిచాల రాజేందర్‌రావును కార్పొరేటర్ ఆకుల నర్మదనరసన్న శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కరీంనగర్ అర్బన్, అక్టోబరు3: కరీంనగర్ కాంగ్రెస్‌పార్టీ నగరశాఖ అధ్యక్షుడు లింగపల్లిబాబు, మాజీ కార్పొరేటర్ లింగపల్లి శ్రీనివాస్‌ను గురువారం కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంటట్ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శించారు. ఇటీవల లింగంపల్లి బాబు, శ్రీనివాస్ తల్లి మల్లమ్మ మరణించగా వారి నివాసానికి వెళ్ళిన రాజేందర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దుర్గాభవానీ ఆశీస్సులు అందరిపై ఉండాలి

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 3: దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ ఆకాంక్షించారు. గురువారం కరీంనగర్ కట్టరాంపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గాదేవి విగ్రహం వద్ద వెలిచాల రాజేందర్‌రావు స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మదనరసన్నతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫ్యామిలీ హెల్త్ కార్డు సర్వే

శంకరపట్నం, అక్టోబరు 3: మండలంలోని అర్కండ్ల గ్రామంలో గురువారం తహసీల్దార్ బత్తుల భాస్కర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ హెల్త్ కార్డు సర్వే నిర్వహించారు. నాలుగు టీముల ద్వారా ఫ్యామిలీ హెల్త్ కార్డు కోసం అవసరమైన వివరాలు సేకరించి నమోదు చేశారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

హుజూరాబాద్, అక్టోబరు 3: పట్టణంలోని గాంధీనగర్, బుడగజంగం కాలనీల్లో వర్షాలకు ఇళ్లలోకి నీరు రాకుండా ఉండేందుకు గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ స్వచ్ఛందంగా రోడ్డుపై మొరం పోయించారు. గత నెల భారీ వర్షాలకు రెండు కాలనీల్లో వరదనీరు ఇళ్లల్లోకి చేరింది. పరామర్శకు వెళ్లిన ప్రణవ్‌కు కాలనీవాసులు సమస్య వివరించారు. ఈ సమస్యను పరిష్కారిస్తానని హామీ మేరకు వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా రోడ్డు మొరం పోయించడంతో పాటు మురికి కాలువలను శుభ్రం చేయించారు. కాలనీవాసులు ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

గంగాధర, అక్టోబరు 3: గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు. వడ్డెర కాలనీలో మహిళలు బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహించుకునేందుకు లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే హైమాస్ట్ లైట్లను మంజూరు చేయగా గురువారం సిబ్బంది వాటిని అమర్చారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

తిమ్మాపూర్, అక్టోబరు 3: మండలంలోని మొగిలిపాలెంలో నిరుపేద కుటుంబానికి చెందిన కాల్వ సుమలత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకుల సహకారంతో 78,800రూపాయలు జమచేసి బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కపల్లి సంపత్, బొన్నగిత్త లింగయ్య, చిన్నబోయిన రవి, వర్కోలు మల్లయ్య, ఐక్కుల శ్రీని వాస్, కేశవులు, రజాక్, మహేష్, సంపత్, మల్లేష్, విజయ్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఎంఎంఆర్ నుంచి నీటి విడుదల నిలిపివేత

తిమ్మాపూర్, అక్టోబరు 3: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎంఎంఆర్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలను ఇరిగేషన్ అధికారులు గురువారం ఉదయం నిలిపి వేశారు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు. కాగా ప్రస్తుతం 23.430 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ మానేరు నుంచి 200క్యూసెక్కుల నీరు మాత్రమే ఎల్ఎండీలోకి చేరుతోంది. కాకతీయ కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 277 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.